సంస్థాన్‌లో అత్యాధునిక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తా

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, జనవరి 18 : మండల కేంద్రంలో దాదాపు ఐదెకరాల్లో అత్యాధునిక క్రికెట్ స్టేడియంతోపాటు అన్ని రకాల క్రీడలు ఆడుకునేందుకు వీలుగా త్వరలోనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎన్‌పీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు స్పాన్సర్లు ఉప్పల లింగస్వామి, ముద్దంగుల నర్సింహతో కలిసి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. పుట్టపాక లయన్స్ జట్టుకు మొదటి బహుమతి, పోలీస్ టీమ్‌కు ద్వితీయ, అండర్-16 టోర్నమెంట్‌లో పుట్టపాక జూనియర్స్ ప్రథమ, గుడిమల్కాపురం జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనునాయక్, నాయకులు గుత్తా ఉమాదేవి, వీర మళ్ల భానుమతీగౌడ్, జైపాల్‌రెడ్డి, రమణారెడ్డి, నర్సింహ, నాగరాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శ


నర్సింహను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

రామన్నపేట, జనవరి 18 : మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం తండ్రి కన్నెబోయిన నర్సింహ ప్రమాదవశాత్తు కాలు విరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ పిట్టల కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ముప్పిడి దయాకర్, నాయకులు కన్నెబోయిన వెంకటేశం, వంగాల యాదయ్య, మల్లేశం, స్వామి, శంకర్, పరశురాములు, సత్యనారాయణ, లింగస్వామి, వెంకన్న, రామచంద్రం ఉన్నారు.

బీఆర్ఎస్వీ నేతకు క్యామ మల్లేశ్ పరామర్శ

సహదేవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్యామ మల్లేశ్

సంస్థాన్ నారాయణపురం, జనవరి 18 : బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్ తండ్రి సహదేవ్ గురువారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ శనివారం రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్రి నరసింహ, నాయకులు కట్టెల భిక్షపతి, జగన్‌రెడ్డి, స్వామి, యాదయ్య, మల్లేశ్, శేఖర్ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి : జహంగీర్

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆలేరు టౌన్, జనవరి 18 : సంగారెడ్డిలో ఈ నెల 25నుంచి 28వరకు జరుగనున్న సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలేరులో శనివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశంలో అనేక వైషమ్యాలు సృష్టించిందన్నారు. దేశ ప్రజల్లో స్వేచ్ఛ, స్వాతంత్రం, లౌకిక విధానం, ఫెడరల్ స్ఫూర్తిని నింపిన భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని బలవంతంగా రుద్దాలనే ప్రయత్నం బీజేపీ, దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్ఎస్ చేస్తుందని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనూరాధ, జిల్లా నాయకులు కల్లూరి మల్లేశం, జయరాములు, మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు సత్యరాజయ్య, పాల్, తులసయ్య, గణేశ్, శంకర్, రాజు, శంకరయ్య, అంజయ్య, యాదగిరి, లక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భువనగిరి అర్బన్, జనవరి 18 : అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, కానీ.. ఇప్పుడు ఒక్కో గ్రామంలో 20నుంచి 50 మందికి మాత్రమే కార్డులు మంజూరైనట్లు చెప్పున్నారని తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎదునూరి మల్లేశం, దయ్యాల నర్సింహ, పల్లెర్ల అంజయ్య, కొండ అక్షక్, అన్నంపట్ల కృష్ణ, కొండమడుగు నాగమణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మున్నాబీ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఓరుగంటి నర్సింహగౌడ్, కోట ఎల్లయ్య, షేక్ మున్నాబీ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ శనివారం రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వరిగంటి రమేశ్‌గౌడ్, సందీప్‌కుమార్, కిరణ్, బాలరాజు, షేక్ యాకూబ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయు నదేమనగా, నా క్లయింట్ మరాఠి భిక్షపతి గౌరవనీయ Prl. సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్, భువనగిరి, యాదాద్రి-భువనగిరి జిల్లా సమక్షంలో డిఫెండెంట్/ప్రతివాది మరాఠి ప్రమీలపై శాశ్వత నిషేధాజ్ఞ కొరకు O.S.No.07/2025 మరియు I.A.No. 07/2025 ద్వారా దావా దాఖలు చేశారు మరియు సదరు కోర్టు దావా షెడ్యూల్ ఆస్తి అనగా యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలంలోని మల్యాల గ్రామం పట్ట గల సర్వే నెం. 38Aలో ఎ.1.02 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి (**సరిహద్దులు: ఉత్తరం:**దర్శన్ భూమి, **దక్షిణం:** గడ్డమీద సుబాష్ భూమి, **తూర్పు:** సాకలి సాయిలు భూమి, **పడమర:** భాగ్య భూమి)ని అన్యాక్రాంతం చేయుట నుండి డిఫెండెంట్/ప్రతివాదిని నిరోధించుటకు మధ్యకాలీన నిషేధాజ్ఞను మంజూరు చేసినది.

అందువల్ల సదరు కోర్టు ఉత్తర్వు దృష్ట్యా దావా షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయరాదని తెలియజేయడమైనది, ఈ ఆస్తిపై ఏదేని లావాదేవీ చట్ట విరుద్ధం మరియు సమర్థించతగదు మరియు సదరు దావా పెండింగ్‌లో ఉన్నందున కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించరాదు.

సం/- కె. గోపాల్ రావు, డి. ఉదయ్ శంకర్
పొన్న వేణు మాధవ్, అడ్వకేట్
భువనగిరి. సెల్ నెం.9848763668
8179410971

నేడు లలితా శతకావిష్కరణ మహోత్సవం

భూదాన్ పోచంపల్లి, జనవరి 18 : పట్టణంలోని చేనేత టై అండ్ డై సిల్క్ చీరెల ఉత్పత్తిదారుల సంఘం భవనంలో జాతీయ తెలుగు సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10:45 గంటలకు లలిత శతకావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కవి వడ్డేపల్లి రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ తెలుగు సాహితీ పీఠం అధ్యక్షుడు నలవోలు నరసింహారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ మహిళా సాహిత్య సేవా సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ, తెలంగాణ పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగంశాస్త్రి, పలువురు కవులు హాజరు కానున్నారని తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

● కలెక్టర్ హనుమంతరావు

విద్యార్థులకు కరదీపిక అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ దివీస్ లేబొరేటరీస్ సౌజన్యంతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు డీఈఓ సత్యనారాయణతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సహాయ సంచాలకులు ప్రశాంత్‌రెడ్డి, పాండు నాయక్, రఘురాంరెడ్డి, ఎంఈఓలు నాగవర్ధన్‌రెడ్డి, లక్ష్మి, సెక్టోరల్ అధికారులు జె.శ్రీనివాసులు, రాధ, లింగారెడ్డి, నరహరి, దివీస్ కంపెనీ యాజమన్యం కిశోర్‌కుమార్, గోపి, బుక్ డిపో మేనేజర్ రంగరాజన్ పాల్గొన్నారు.

సాగు భూమికి మాత్రమే రైతు భరోసా

బీబీనగర్ : వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీకి నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను శనివారం ఆయన పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఫీల్డ్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అన్నారు. అర్హుల ఎంపిక ఎంత ముఖ్యమో, అనర్హుల ఏరివేత కూడా అంతే ముఖ్యమని సూచించారు. అనంతరం రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి రికార్డులను పరిశీలించారు. చెరువు శిఖంలో ఉన్న వ్యవసాయ యోగ్యం కాని భూముల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తాసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

యాదాద్రి భువనగిరి, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : జడ్జి పేరు చెప్పి అక్రమ నిర్మాణాలు చేపడుతూ అధికారులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కలెక్టర్ హనుమంతరావుకు రాజాపేట మండలంలోని జాల గ్రామస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. జాల గ్రామానికి చెందిన మొగిలి కిష్టయ్య ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని, రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టగా పంచాయతీ కార్యదర్శి తొలగించినట్లు పేర్కొన్నారు. కిష్టయ్య కుమారుడు శ్రీకాంత్ జడ్జి పేరు చెబుతూ పంచాయతీ కార్యదర్శిని, గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలు ఆపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బాలాచారి, కోటయ్య, ఐలయ్య, సత్తిరెడ్డి, చంద్రయ్య, సాయిలు, గణేశ్, కనకయ్య పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా నార్మూల్ అభివృద్ధి చేశా

● నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 18 : తమ రెండేండ్ల పాలనలో అవకతవకలకు చోటు లేకుండా నార్మూల్ సంస్థను లాభాలు చేకూర్చే విధంగా కృషి చేశామని నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాలకవర్గం అవకతవకలకు పాల్పడినట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. ప్రస్తుత నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అవగాహన లేక ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. నార్మూల్ సంస్థ స్థిరాస్తులను విక్రయించేందుకే చైర్మన్ పదవి చేజిక్కించుకున్నాడన్న అనుమానం వస్తోందని తెలిపారు. సంస్థలో 25 ఏండ్లు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను కాపాడుకునేందుకు వారిలో 180 మంది ఉద్యోగులను ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిబంధనల ప్రకారమే పర్మినెంట్ చేశామని వివరించారు. తమ హయాంలో రూ.6కోట్లతో పెరుగు ప్లాంట్, నూతన బ్రాయిలర్స్‌తోపాటు నార్మూల్ భవనాన్ని సుందరీకరించామని తెలిపారు. మిగతా రూ.6 కోట్లను రోజుకు అదనంగా 60 వేల లీటర్ల పాలకు కట్టివ్వడంతోపాటు స్కిన్ మిల్క్ విక్రయాలకు వాడామని వివరించారు. రైతులకు లీటర్‌కు రూ.5 బోనస్ చెల్లించామని తెలిపారు. మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాల క్రయ, విక్రయాలు తగ్గాయని, రైతులకు లీటర్‌కు రూ.1.50పైసలు తగ్గించారని పేర్కొన్నారు. గతంలో రోజుకు 95వేల పాలను విక్రయించినా సంస్థ నష్టాల్లో ఉంటే.. ప్రస్తుతం 35వేల లీటర్లు విక్రయిస్తే సంస్థ ఎలా నడిపిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఆడిట్ రిపోర్టు చూపించి ప్రభుత్వానికి రూ.45లక్షల ట్యాక్స్ కట్టకపోతే యాక్సిస్ బ్యాంకులో రూ.25 కోట్ల ఓడీ ఉండదని, ఓడీని కాపాడుకునేందుకే ట్యాక్స్ చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. రూ.50 కోట్ల లోటు బడ్జెట్‌తో సంస్థ కొనసాగుతుందని కొత్తగా ఎన్నికైన జనరల్‌బాడీ తొలి సమావేశంలో చెప్పానని పేర్కొన్నారు. నష్టాల్లో ఉన్న సమయంలో సంస్థను ఎలా కొనసాగిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. విమర్శించాలని భావిస్తే అందరి పేర్లను బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వం నుంచి రూ.30 కోట్ల గ్రాంట్ తీసుకొస్తామని హామీనిచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చడం పాడి రైతులను మోసం చేసినట్టేనని ఆరోపించారు. రైతులకు నాలుగు నెలల బిల్లులను పెండింగ్‌లో పెట్టడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ తీసుకురాలేని ప్రస్తుత చైర్మన్‌కు సంస్థ భూములను విక్రయించే అర్హత లేదని తెలిపారు. దమ్ముంటే ఒక ఏడాదిపాటు నష్టాలు లేకుండా సంస్థను కొనసాగించి చూపాలని సవాల్ చేశారు. అలా కొనసాగిస్తే భూములను విక్రయించేందుకు సహకరిస్తామని తెలిపారు. తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి, ఖర్చు వివరాలను ఆధారాలతో సహా వివరణ ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు.

ఆటోలో ప్రసవం .. తల్లీబిడ్డ క్షేమం

ఆటోలో ప్రసవించిన కుష్బూదేవి, శిశువును ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : పురిటి నొప్పులతో ఆటోలో భర్తతో కలిసి దవాఖానకు వెళ్తున్న వలస కార్మికురాలు నొప్పులు ఎక్కువై ఆటోలోనే ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో నివాసముంటున్న బీహార్‌కు చెందిన వలస కూలీ కుష్బూదేవికి పురిటి నొప్పులు రావడంతో భర్త అఖిలేశ్‌యాదవ్ ఆటోలో భువనగిరికి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో రేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. ఆటో డ్రైవర్ వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోపే కుష్బూదేవి ఆటోలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. 108 సిబ్బంది శిశువుకు, తల్లికి ప్రథమ చికిత్స అందిస్తూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి తల్లీబిడ్డను ఆసుపత్రిలో చేర్చిన అంబులెన్స్ సిబ్బందిని మహిళ కుటుంబ సభ్యులు అభినందించారు.

తాను మరణిస్తూ పలువురికి అవయవదానం

నవీన్ (ఫైల్)

సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

మోటకొండూర్, జనవరి 18 : తాను మరణిస్తూ తన అవయవాలను పలువురికి దానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు మండల కేంద్రానికి చెందిన మల్గ నవీన్. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నవీన్ వారం రోజుల క్రితం తన పెద్ద కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాల ట్రాక్టర్ ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో దానిని ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. నవీన్‌ను ఎల్‌బీనగర్ కామినేని దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దాంతో కుటుంబ సభ్యులు నవీన్ అవయవాలను పలువురికి దానం చేసి కొత్త జీవితాన్నందించారు. నవీన్‌కు తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

న్యాయం చేయాలని బంధువులు ధర్నా

నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం మృతదేహంతో ధర్నా చేశారు. నిబంధనలు పాటించకుండా నిండు ప్రాణాన్ని బలిగొన్నందుకు విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్, డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు. పోలీసులు వచ్చి మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

రాఘవాపురంలో పశు వైద్య శిబిరం

రాఘవాపురంలో పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్

ఆలేరు రూరల్, జనవరి 18 : మండలంలోని రాఘవాపురంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 75 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి చైతన్య, మాజీ ఎంపీటీసీ అరె ప్రశాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

రామన్నపేట, జనవరి 18 : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిషు బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు పీజీలో జనరల్, బీసీ అభ్యర్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. దాంతోపాటు బోధనా అనుభవం ఉన్నవారు ఈ నెల 21న 3గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాయగిరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : పట్టణంలోని రాయగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో 45-50 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐలు ఎన్.చంద్రబాబు, వి.సంతోష్‌కుమార్ ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యా, హత్యా అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నామని, మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరు చోరీ

భూదాన్ పోచంపల్లి, జనవరి 18 : మండలంలోని గౌస్‌కొండ గ్రామ శివారులో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్ చోరీ చేశారు. గ్రామానికి చెందిన వంగూరి బుచ్చయ్య కుమారుడు స్వామి శనివారం ఉదయం వరి పొలానికి నీళ్లు పెడుదామని మోటర్ ఆన్ చేశాడు. కరెంటు రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి చూడగా.. పగులగొట్టి అందులో నుంచి కాపర్ వైరు దొంగిలించినట్లు గమనించాడు. దాని విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బాలికపై లైంగికదాడి

చౌటుప్పల్, జనవరి 18 : ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) పదో తరగతి చదువుతుంది. యాదగిరిగుట్ట మండలంలోని తన మేనమామ గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఈ నెల 8న ఆ బాలికను బైక్‌పై తీసుకెళ్లాడు. అనంతరం లైంగికదాడి చేయగా.. బాలిక తన తల్లిదండ్రులకు విషయం చెప్పింది. చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అదుపు తప్పి బియ్యం లారీ బోల్తా

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : అదుపు తప్పి బియ్యం లోడుతో ఉన్న లారీ బోల్తా పడింది. వలిగొండ హనుమాన్ పార్ బాయిల్డ్ రైస్ మిల్లుకు చెందిన లారీ శనివారం బియ్యం లోడుతో భువనగిరి వైపు వెళ్తుండగా.. అనాజీపురం గ్రామ సమీపంలో అదుపు తప్పి పక్కకు పడిపోయింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ లింగస్వామి సురక్షితంగా బయటపడ్డాడు.

సర్వేలో తప్పిదాలు ఉండొద్దు

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట : తాసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 18 : రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావు ఉండొద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల తాసీల్దార్ కార్యాలయాల్లో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం నియమించిన బృందం సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే బృందాల పనితీరును సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియ జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో అర్హులెవరూ తప్పిపోకుండా చూడాలన్నారు. అనంతరం పలువురి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశ్యా, ఏఓ సుధారాణి, ఎంపీడీఓలు నవీన్‌కుమార్, ఝాన్సీబాయ్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మోత్కూరు : ప్రభుత్వం పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని పనకబండ గ్రామంలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. సాగు చేసే భూములకు మాత్రమే రైతుభరోసాలో చోటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యాదయ్య, తాసీల్దార్ రాంప్రసాద్, ఏఓ కీర్తి పాల్గొన్నారు.

సాగు భూమికే రైతు భరోసా

అడ్డగూడూరు : సాగు చేసే భూములకే రైతు భరోసా ఇచ్చే విధంగా సర్వే చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు జానకిపురంలో రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సర్వేలో వ్యవసాయ అధికారులు చేపడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సాగుకు యోగ్యం కాని భూములను రైత